సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 24 । మే । 2024



సేంద్రియ సేద్యం
రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి సేంద్రియం వైపు అడుగులేస్తున్నారు. దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. 8లో ▸



ఉచిత బీమా కల్పించండి
ప్రైవేట్ పాఠశాలల యజమానులు, టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డి కోరారు. 8లో ▸



చామంతి సాగు భలే బాగు
చామంతి పూలసాగుకు మంచి సమయం రానే వచ్చింది. రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

నేడు పాలెంలో విత్తన మేళా
కొడంగల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పాలెంలో శుక్రవారం విత్తన మేళా జరుగుతుందని కొడంగల్ వ్యవసాయ విస్తరణ అధికారి రాజు రాథోడ్ గురువారం తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. వివిధ రకాల నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పంటల సమగ్ర సమాచారం గురించి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఉదయం 10 గంటలకు పాలెంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి చేరుకోవాలని సూచించారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



అనంతగిరి: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్ష జరిగే సమయంలో బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. జూన్ 3 నుంచి 11వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ రేణుకాదేవి, రవాణా శాఖ అధికారి జోషఫ్, మిషన్ భగీరథ అధికారి బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందుబాటులో కంది విత్తనాలు



డాక్టర్ సుధరాణి

తాండూరు రూరల్: తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధారాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న విత్తన మేళా నిర్వస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ తాము రూపొందించిన వివిధ కంది రకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. తెలంగాణ కంది (టీడీఆర్ జీ–59), ఆశ (ఐసీపీఎల్ 87119) అందుబాటులో ఉంటాయన్నారు. నూతన వంగడాల లక్షణాలు, వాటి గుణగణాలపై రైతులకు అవగాహ కల్పిస్తామని చెప్పారు. విత్తనాల ఒక్కో ప్యాకెట్ ధర రూ.600 ఉంటుందన్నారు. అవసరం ఉన్న రైతులు తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో సంప్రదించాలని కోరారు.

కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాలకు అనుమతి
కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని కోస్గి పట్టణంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఏఐసీటీఈ నుంచి అనుమతి లభించిందని అధికారిక వర్గాలు గురువారం తెలిపాయి. కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను తెలంగాణ ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ ఇంజనీరింగ్ కళాశాలగా మార్చింది. అయితే ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేసేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతి ఇచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడింది. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డాటా సైన్స్) కోర్సుల్లో ఒక్కో విభాగంలో 60 చొప్పున మొత్తం 360 సీట్లను భర్తీ చేస్తారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో ఆయా సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అగ్రికల్చర్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించిన వారితో సీట్లు భర్తీ చేస్తారు.

మొక్కలు సిద్ధం చేయాలి
రంగారెడ్డి డీపీఓ సురేశ్ మోహన్

కడ్తాల్: హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలని, నీటి ఇబ్బందులు తలెత్తకుండా దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామ శివారు పిరమిడ్ సమీపంలో ఏర్పాటు చేసిన గ్రీన్‌ఎర్త్ షెల్టర్ వెంచర్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు. 2008లో ఏర్పాటు చేసిన 25 ఎకరాల అనధికార లేఅవుట్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు, ఆ వెంచర్‌ను సైతం పరిశీలించారు.

● భక్తిభావం



తాండూరు మండలం కోత్లాపూర్ శివారులో కొలువుదీరిన రేణుక ఎల్లమ్మ జాతర గురువారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూన్ 22వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. జూన్ 7న రథోత్సవం, సిడె కార్యక్రమం నిర్వహించనున్నారు. జాతరకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ జిల్లాల నుంచి భక్తులు రానున్నారు.
– తాండూరు రూరల్

● ఉపశమనం



ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు. వృద్ధులు చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఉదయం 10 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను వినియోగిస్తున్నారు. చల్లటి పానీయాలతో సేద తీరుతున్నారు.
– ధారూరు

● నిర్లక్ష్యం



విద్యుత్ స్తంభాలకు, వైర్లకు తీగ మొక్కలు తాకుతున్నా పట్టించుకునే నాథులే కనిపించడం లేదు. నవాబుపేట మండలం మాదిరెడ్డి పల్లి – మైతాప్‌ఖాన్‌గూడ గ్రామాల మధ్య ఉన్న విద్యుత్ సంభాలకు, తీగలకు చెట్లు తగులుతున్నాయి. చాలా గ్రామాల్లో వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.
– నవాబుపేట

పేకాట అడ్డాగా ఫాంహౌస్‌లు

నిత్యం లక్షల్లో జూదం
- వీకెండ్‌లో మరింత అధికం
- తెలంగాణ జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి పేకాటరాయుళ్లు
- అన్ని సదుపాయాలు కల్పిస్తున్న నిర్వాహకులు
- పట్టించుకోని పోలీసులు

జిల్లాలో మూడుముక్కలాట మూడుపూలు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. పేకాటను ప్రభుత్వం నిషేధించడంతో క్లబ్‌ల నిర్వాహకులు నగర శివారు ప్రాంతాలను అడ్డాగా మలుచుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఫాంహౌస్‌లను ఎంచుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా జూదం నిర్వహిస్తూ జేబులు నింపుకొంటున్నారు.



వికారాబాద్: శివారు ప్రాంతాలు, ఫాంహౌస్‌లు పేకాటకు అడ్డాగా మారుతున్నాయి. క్లబ్‌ల తరహాలో జూదం సాగుతోంది. జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచికూడా జూదరులు వస్తున్నారు. జిల్లా నగరానికి సమీపంలో ఉండటంతో ఇటీవల ఫాంహౌస్ కల్చర్ బాగా పెరిగిపోయింది. ఇవి బడాబాబులవి కావడంతో పోలీసులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మర్పల్లి, మోమిన్‌పేట, నవాబుపేట, వికారాబాద్, పూడూరు మండలాల్లో ఫాంహౌస్‌లు ఎక్కువగా ఉన్నాయి. వీటిపై పోలీసుల నిఘా కొరవడటంతో విచ్చలవిడిగా పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. గతంలో స్నేక్ గ్యాంగ్ సైతం మన జిల్లాకు చెందిన ఫాంహౌస్‌నే స్థావరంగా ఏర్పాటు చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. కొంత మంది నగర వాసులు జిల్లాలో వన్యప్రాణాలను వేటాడబోయి పశువులు, కుక్కలను కాల్చి చంపిన ఘటనలు కలకలం రేపాయి. పేకాట నిర్వహణ మాత్రం పోలీసుల కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా సరిహద్దు ప్రాంతంలో..
జిల్లా సరిహద్దు ప్రాంతం.. మర్పల్లి మండలం.. కొంశెట్‌పల్లి శివారులో కొన్ని నెలలుగా పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఐదెకరాల్లో పెద్ద భవనం నిర్మించి ఫాంహౌస్‌గా మార్చారు. గతంలో వివిధ ప్రాంతాల్లో పేకాట క్లబ్‌లు నిర్వహించిన అనుభవం ఉన్న ఓ వ్యక్తి ఈ ఫాంహౌస్‌ను లీజుకు తీసుకొని పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. సాధారణ రోజుల్లో 30 నుంచి 40 మంది జూదరుల ఇక్కడికి వస్తుంటారు. వారాంతంలో మాత్రం వందల సంఖ్యలో పేకాటరాయుళ్లు వస్తున్నట్లు సమాచారం. జిల్లా వాసులతో పాటు పక్క జిల్లాల నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పేకాట ఆడేందుకు వస్తున్నట్లు తెలిసింది. ఇక్కడికి వచ్చే వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. హైదరాబాద్ పేకాటకు అనుకూలంగా లేకపోవడంతో ఇక్కడికి మకాం మార్చినట్లు తెలిసింది. నిత్యం లక్షల్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం.

చూసీచూడనట్లుగా..
జిల్లా సరిహద్దు ప్రాంతంలో జోరుగా పేకాట జరుగుతున్నా పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. పేకాటలో సర్వం కోల్పోయి కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు మూడు సార్లు స్థానిక పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను వదిలేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే కట్టడి చేయాల్సిన వారే అండగా నిలుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుకోని సంఘటనలు జరగకముందే పేకాట స్థావరాలపై దాడులు చేసి కట్టడి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సర్వమత సూక్తుల సారాంశం ఒక్కటే

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం: కుల మతాలు వేరైనా సర్వమత సూక్తుల సారాంశం ఒక్కటేనని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఖాద్రా మౌలాలీ దర్గాలో మాజీ సర్పంచ్ బర్కత్‌పల్లి నర్సింలు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి వస్త్రాలు, పూలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో మెలగాలన్నారు. పండుగలు ఏవైనా అందరూ కలసికట్టుగా, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. యువత వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్ గౌడ్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి, సీనియర్ నాయకులు రాములు యాదవ్, మొగులయ్య, పురుషోత్తంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు మోహన్‌రెడ్డి, సుదర్శన్, వేణుగోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి శంకర్‌యాదవ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అజీం, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- సకాలంలో మరమ్మతులు పూర్తిచేయాలి
- దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ ముషారఫ్ ఫరూఖీ

అనంతగిరి: రానున్న వర్షాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు సర్కిల్ పరిధిలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. బుధవారం రాత్రి వికారాబాద్ విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో ముఖ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుత వేసవి సీజన్‌లో విద్యుత్ డిమాండ్ భారీ స్థాయిలో పెరిగిందన్నారు. పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని చేపట్టిన పనులను పూర్తి చేయాలన్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల కొట్టివేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ జయరాజ్, డీఈ సంజీవ్, ఏడీ సత్యనారాయణరెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిసిన కసిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు, భక్తులు



గిరిప్రదక్షిణలో భక్తజనం

పవిత్ర క్షేత్రం.. పాంబండ

- ఆలయ అభివృద్ధికి సహకరిస్తా
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ

కుల్కచర్ల: సనాతన ధర్మాలను ఆచరిస్తూ మన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండవెల్కిచర్ల పరిధిలోని పాంబండ రామలింగేశ్వర ఆలయంలో గిరి ప్రదక్షిణ వేడుక వైభవంగా సాగింది. ఎమ్మెల్యే క్షేత్రం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాంబండ క్షేత్రం అత్యంత పవిత్రమైనదని అన్నారు. కోరిన కోర్కెలు తీర్చే దేవస్థానంగా భక్తులు విశ్వసిస్తారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకురాలు జయశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, వైస్ చైర్మన్ నాగరాజు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, బండవెల్కిచర్ల ఎంపీటీసీ జ్యోతి, ఆలయ అర్చకులు పాండుశర్మ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్వత్రా.. స్థానిక చర్చ



స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి
- చర్చనీయాంశమైన రిజర్వేషన్ల అంశం
- గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇవే మాటలు
- ఆశావహుల్లో ఎడతెగని ఉత్కంఠ
- ప్రభుత్వ స్పష్టత కోసం ఎదురుచూపులు

చేవెళ్ల: ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల వాతావరణం నుంచి బయటకు వచ్చిన పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇక గ్రామాల్లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఏ పార్టీ నాయకుల నోట విన్నా రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయి అన్న మాటే వినిపిస్తోంది. రిజర్వేషన్లు మారుతాయా లేదా పాత వాటినే కొనసాగిస్తారా అనేది ప్రస్తుతం స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న నాయకుల్లో గుబులు రేపుతున్న ప్రశ్నలు. జిల్లాలోని ఏగ్రామంలో చూసినా వీటి పైనే చర్చ జరుగుతోంది.

ఎవరికి వారు అంచనాలు
లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచారాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు బీసీ రిజర్వేషన్లు పెంచుతామనే ప్రకటన కూడా రావడంతో ఇప్పటికే స్థానిక సంస్థలకు పోటీ చేసేందుకు సిద్ధమైన నాయకుల్లో భయం పట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుటుందోనని ఆలోచనలో పడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు ఇతర పార్టీల నాయకులు సైతం రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయని చర్చించుకుంటున్నారు. ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే వస్తే స్వయంగా.. కొత్తగా మారితే మరొకరు ఉండాలనే ఆలోచనతో కూడా నాయకులు చర్చలు సాగిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లు అవే రిజర్వేషన్లు ఉంటాయని ప్రకటించటంతో గ్రామాల్లో గతంలో హడావుడి చేసిన నాయకులు ప్రభుత్వం నుంచి స్పష్టత రానీ అప్పుడు ఆలోచన చేద్దామని అంటున్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేస్తుందా.. అమలు చేస్తే ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లు పెంచాలంటే తప్పనిసరిగా బీసీ గణన చేస్తే గానీ స్పష్టత రాదని.. అప్పటి వరకు రిజర్వేషన్లు పెంచే అవకాశం ఉండకపోవచ్చనే వాదన కూడా వినిపిస్తోంది.

స్థానిక సంస్థల చర్చలే ప్రధానాంశం
జిల్లాలోని ఏ గ్రామంలో చూసినా ఇప్పుడు ఆయా పార్టీల నాయకులు మా పార్టీలో మా వర్గం నుంచి పలానా వ్యక్తి సర్పంచ్ అభ్యర్థి, పలానా వ్యక్తి ఎంపీటీసీ అభ్యర్థి అన్న మాటలే వినిపిస్తున్నాయి. వేసవి కాలం కావడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడంతో నాయకులు, కార్యకర్తలంతా ఖాళీగానే ఉన్నారు. వీరంతా ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని.. వస్తే ఎలా వ్యవహరించాలనే దానిపై ఆలోచనలో పడ్డారు. ఎప్పుడైనా స్థానిక నగరా మోగే అవకాశం ఉండటంతో ఇప్పటి నుంచే వారు సన్నద్ధం అవుతున్నారు. అంతే కాదు రిజర్వేషన్ల ప్రకారం కూడా జనరల్ అయితే ఒకరు ఎస్సీ, బీసీ అయితే వారి పార్టీ లోని ఆయా కులాలకు చెందిన వారు ఉంటారనే అంచనాలకు వస్తున్నారు. సోషల్ మీడియాలో రోజుకోరకంగా వస్తున్న పోస్టులతో మరింత చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

పిడుగుపాటుకు ఆవు మృతి



ఆవు కళేబరం వద్ద దీనంగా రైతు

పరిగి: పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఖుదావన్‌పూర్‌ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ చంద్రయ్య పాడి ఆవుల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం కురిసి వర్షానికి పిడుగుపడడంతో పొలంలో మేత మేస్తున్న ఆవు మృత్యువాత పడిడింది. రూ.లక్ష నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే తతను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

కారును ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన కారు

మొయినాబాద్‌: లారీని రోడ్డు ఎక్కిస్తుండగా కారు నెమ్మదిగా వెళ్తుండడంతో వెనుకనుంచి వేగంగా వచ్చిన మరో లారీ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. షేక్‌పేట్‌కు చెందిన డ్రైవర్‌ వెంకటయ్య గురువారం కారులో చేవెళ్ల వైపు ప్రయాణిస్తున్నాడు. హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై కేతిరెడ్డిపల్లి గేటు సమీపంలో ఓ లారీని రోడ్డెకిస్తుండగా ఆయన కారును స్లో చేశాడు. వెనుక నుంచి వస్తున్న మరో లారీ కారును వేగంగా ఢీకొట్టింది. కారు ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జవ్వగా వెంకటయ్య ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తలకొండపల్లి: ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన పెరుమాళ్ల కుమార్‌(30) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం కుమార్‌ తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్విమ్మింగ్‌ పోటీల్లో పుల్లారెడ్డి సత్తా

అత్తాపూర్‌: సికింద్రాబాద్‌ మున్సిపల్‌ (వీవీ గురుమూర్తి మెమోరియల్‌)లో గురువారం పాన్‌ ఇండియా గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో స్విమ్మింగ్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రాజేంద్రనగర్‌ సర్కిల్‌ అత్తాపూర్‌ బస్తీకి చెందిన గంగిడి పుల్లారెడ్డి (52) 400 మీటర్ల స్విమ్మింగ్‌ ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటారు. స్విమ్మింగ్‌ ఫ్రీ స్టైల్‌ 200 మీటర్ల పోటీలో రెండోస్థానంలో నిలవగా, బటర్‌ఫ్లై పోటీలతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పోటీలు ముగిసిన అనంతరం విజేతగా నిలిచిన గంగిడి పుల్లారెడ్డికి పాన్‌ ఇండియా గేమ్స్‌ ఫెడరేషన్‌ ప్రతినిధులు బహుమతి, మెడల్స్‌ అందజేశారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్‌ గంగిడి పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థి స్థాయి నుంచి స్విమ్‌ చేయడం అలవాటుగా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులది కూడా అని సూచించారు. గత 30 సంవత్సరాలుగా సరదాగా ప్రారంభించిన స్విమ్మింగ్‌ ప్రతిరోజు స్విమ్‌ చేస్తూ దేశంలో స్విమ్మింగ్‌ పోటీలు ఎక్కడ జరిగిన పోటీలలో పాల్గొంటూ బహుమతులు తీసుకురావడం జరుగుతుందని సాక్షికి వివరించారు. సర్వరోగ నివారిణిగా సహకరించడంతో పాటు శారీర దృఢత్వానికి మనము అనుకున్న సంకల్పానికి దగ్గరగా చేస్తుందని పుల్లారెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో స్విమ్మింగ్‌ పూల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్విమ్మింగ్‌ నేర్పించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ మేరకు క్రీడారంగంలో మంచి ప్రావీణ్యం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డిని త్వరలో కలుస్తామని ఈ సందర్భంగా వివరించారు.

జూ పార్క్‌లో మిల్లెట్స్‌ వైవిధ్య ప్రదర్శన

ఏజీవర్సిటీ: ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఐసీఏఆర్‌–ఐఐఎంఆర్‌ సంయుక్తంగా నెహ్రూ జూలాజికల్‌ పార్క్‌లో మిల్లెట్స్‌ వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ఐసీఏఆర్‌ (ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మిల్లెట్స్‌ రీసెర్చ్‌ హైదరాబాద్‌ ద్వారా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో మిల్లెట్స్‌ సాగు, ప్రాసెసింగ్‌ కోసం అభివృద్ధి చేసిన సాంకేతికతలు ప్రచురణలతో పాటు ప్రత్యక్ష నమూనాలు, మిల్లెట్స్‌ ఆధారిత ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో జూపార్క్‌కు వచ్చిన సందర్శకులకు మిల్లెట్స్‌ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, పర్యావరణ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంఆర్‌ తరఫున అసిస్టెంట్‌ చీఫ్‌ టెక్నికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మహేష్‌ కుమార్‌, సి. తారా సత్యవతి, దయాకర్‌రావు, జూపార్క్‌ డిప్యూటీ క్యూరేటర్‌ నాగమణి, విద్యాధికారి దీపక్‌ తరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సేద్యం

- రైతుకు, వినియోగదారులకు మేలు
- అవగాహన పెంచుకుంటే లాభాలు
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం
- ఏఓ వెంకటేశం



షాబాద్‌: ప్రస్తుతం రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి సేంద్రియం వైపు అడుగులేస్తున్నారు. దీంతో నేల సారవంతంగా ఉండడంతో పాటుగా రైతులకు లాభాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం సైతం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఏఓ వెంకటేశం తెలిపారు.

ఆవుపేడ, మూత్ర ద్రావణం

ఐదు కిలోల ఆవుపేడ, ఐదు లీటర్ల చొప్పున గోమూత్రం, నీటిని ఒక కుండలో లేదా తొట్టిలో మూడింటిని కలియబెట్టాలి. అనంతరం మూత బిగించి మూడు నుంచి నాలుగు రోజుల పాటు మాగబెట్టాలి. రోజుకు ఒకసారి మూత తీసి ద్రావణ మిశ్రమాన్ని కలపాలి. నాలుగు రోజుల తర్వాత బయటకు తీసిన మిశ్రమాన్ని 20 లీటర్ల నీటితో కలపాలి. ఆ తర్వాత ద్రావణాన్ని వడబోసుకుని దానికి 250 గ్రాముల సున్నం కలపాలి. సున్నంతో ఆవు మూత్రంలోని శాతాన్ని తగ్గిస్తోంది. మనం తయారు చేసిన ప్రతీ లీటర్‌ ద్రావణానికి 10 లీటర్ల నీటిని కలిపి పంటపై పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పురుగు నాలుగు రోజులపాటు పండువాసన గుర్తుపట్టదు. దీంతో అది పంటపై గుడ్డుపెట్టదు. నారు వరిలో కాండం తొలిచే పురుగును గుడ్డు పెట్టకుండా చూస్తుంది. పంటలకు సూక్ష్మపోషకలోపాలను సైతం సరిదిద్దుతుందని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు.

వేప కషాయం

వేప పండ్లను మే, జూన్‌ నెలలో సేకరించి నీడలో ఆరబెట్టాలి. తదనంతరం ఎకరాకు ఎనిమిది నుంచి పది కిలోల చొప్పున పండ్లను నీటిలో నానబెట్టి తొక్క వేరుచేయాలి. వాటిని మొత్తగా రుబ్బాలి. నూరిన ముద్దనంతటిని ఒక పలుచని మూటలో వదులుగా కట్టి 10 లీటర్ల నీటిలో నాలుగు గంటల పాటు నానబెట్టాలి. ప్రతీ 20 నిమిషాలకు మూట నుంచి ద్రావాణాన్ని తీయాలి. ద్రావణాన్ని పలుచడి గుడ్డతో వడకట్టాలి. ఇలా తీసిన కశాయానికి 100 గ్రాముల సర్ఫ్‌ లేదా సబ్బు పొడి కలపాలి. దీంతో ద్రావణం పంటపై చల్లే ప్రక్రియ సులువవుతోంది. ఇది ఆహారాన్ని తినకుండా, ముట్టుకుండా చూస్తుంది. పూతదశలో పూతపైన, ఆకులపైన పురుగులు పెట్టిన గుడ్లను పగలకుండా చూసి ఆగుడ్డు దశలోనే పురుగును చంపుతుంది.



పత్తి పంటకు వేపనూనె పిచికారి చేస్తున్న రైతులు (ఫైల్‌)

వేపనూనె

వేప నూనె నీటిలో కరగదు. లీటర్‌ నీటికి ఐదు లీటర్ల చొప్పున వంద లీటర్ల ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని వంద గ్రాముల సబ్బు పొడిని కలపాలి. దీన్ని పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగులు, కాయ తొలిదశలో పురుగులు, ఆకు ముడత వంటి చీడపురుగులను నాశం చేస్తుందని. వేపనూనె మార్కెట్‌లోనూ లభిస్తుంది.

వేపపిండి

వేపగింజల నుంచి నూనే తీయగా మిగిలిన పిప్పినే వేపిండి అంటారు. ఈ వేపపిండిలో ఐదు శాతం నత్రజని, ఒక శాతం బాస్వరస్‌, ఒక శాతం పోటాష్‌ ఉంటాయి. ఈ వేపపిండిని ఒక ఎకరానికి ఒకటి నుంచి రెండు క్వింటాళ్ల వరకు వేయవచ్చు. ఇది భూమిలోపల కీడు చేసే పురుగుల నిర్మూలిస్తుంది. దుక్కిదున్నే సమయంలో సాలల్లో వేసుకోవాలి. లేదంటే విత్తనాలు నాటకముందు భూమిలో చల్లుకోవాలి.

వీర బ్రహ్మేంద్రస్వామి సూక్తులు అక్షర సత్యాలు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్‌: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కలియుగ మహా కాలజ్ఞానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండలం పరిధిలోని పర్వత్‌పల్లి గ్రామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామి జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఆలయాన్ని సందర్శించి రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయన చెప్పిన మాటలన్నీ అక్షర సత్యమయ్యాయని గుర్తు చేశారు. గ్రామాల్లో పండుగలు, జాతర ఉత్సవాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో భక్తితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయన్నారు. అంతకు ముందు గ్రామస్తులు పోలేరమ్మకు బోనాలతో నైవేద్యం పెట్టారు. ఆలయ కమిటీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ అజయ్‌ ప్రసాద్‌, సుధాకర్‌రెడ్డి జైపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాకొండ కార్యదర్శిని సస్పెండ్‌ చేయండి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాకొండ గ్రామస్తులు

దోమ: పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్‌ చేయాలని రాకొండ గ్రామస్తులలు ఆందోళన చేపట్టారు. గురువారం గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తమ పంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడుతూ.. పంచాయతీ నిధులు కాజేస్తున్నాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం మండల పరిషత్‌ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో జనరల్‌ఫండ్‌, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ.తొమ్మిది లక్షలుండగా.. మాజీ సర్పంచ్‌ మరిది చాపల నర్సింహులుతో పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై తప్పుడు లెక్కలు చూపించి డబ్బు కాజేశాడని ఆరోపించారు. సమీప బంధువుల పేర్లపై డబ్బులు వేసి వాటిని విత్‌ డ్రా చేసుకున్నాడని మండిపడ్డారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే మాజీ సర్పంచ్‌, కార్యదర్శి సహకారంతో తప్పుడు ఎంబీ రికార్డులను సృష్టించి రూ.5.50 లక్షలు డ్రా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని రవికుమార్‌ను వివరణ కోరగా.. గ్రామస్తులకున్న రాజకీయ కక్షలతో తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనకన్న ముందున్న పంచాయతీ కార్యదర్శి తీర్మాణాలు, ఎంబీలకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా, టెక్నికల్‌ సమస్యతో ఆలస్యం జరిగి ఇవ్వలేక పోయాడన్నారు. ఆ తరువాత సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేక పాలన రావడంతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల విషయం సదరు వ్యక్తి తనను చెల్లించాలని కోరాడు. ఈ విషయం ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా, తీర్మానాలు, ఎంబీలు సక్రమంగా ఉంటే డబ్బులు చెల్లించవచ్చు అని చెబితేనే తాను చెల్లిచానన్నారు. తాను సొంత అవసరాలకు, ఎవరి అకౌంట్‌లోకి డబ్బులు వేసుకోలేదని, అనసరమైన ఆరోపణలు తనపై చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

రూ.పది లక్షల ఉచిత బీమా కల్పించండి



మాట్లాడుతున్న ట్రస్మా కోర్‌ కమిటీ సభ్యుడు నాగయ్య

అనంతగిరి: ప్రైవేట్‌ పాఠశాలల యజమానులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి డిమాండ్‌ చేశారు. గురువారం పట్టణంలోని వివేకవాణి విద్యాలయంలో జిల్లా ట్రస్మా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన పాపిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 11వేలకు పైగా ప్రైవేట్‌ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో 35 ఏళ్లుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి వారి అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు డీసీఈబీ ఫీజు ఒకే విధంగా ఉండాలన్నారు. పాఠశాల యాజమానులకు పాఠశాల సిబ్బందికి రూ.10లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. విద్యుత్‌ బిల్లులో రాయితీ ఇవ్వాలన్నారు. బడ్జెట్‌ పాఠశాల స్థాయిని బట్టి రుణ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎన్‌ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి చింతల రాంచంద్రయ్య, రాష్ట్ర కోర్‌ కమిటీ సభ్యుడు ఎం.నాగయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్‌, కోశాధికారి ప్రకాశ్‌, పట్టణ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌, కార్యదర్శి బస్వరాజ్‌, తాండూరు అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మోహన్‌గౌడ్‌, జిల్లా గౌరవ అధ్యక్షుడు లూయిస్‌, కన్వీనర్‌ వేణుగోపాల్‌రావు, సభ్యులు అజారుద్దీన్‌, బాబురావు, సుధీర్‌, విక్రంరెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వస్తే దాడి

- స్టేషన్‌ ఎదుట ఆందోదళన చేపట్టిన పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌



ఠాణా ఎదుట బైఠాయించిన శ్రీనివాస్‌



శ్రీనివాస్‌, కానిస్టేబుల్‌ మధ్య పెనుగులాట

తాండూరు టౌన్‌: ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తనపై ఓ కానిస్టేబుల్‌ దాడి చేశాడని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌ గురువారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌ ఎదుట ఆందోళన చేపట్టాడు. ఆయనకు సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాలు మద్దతు పలికాయి. వివరాల ప్రకారం.. టీవీఎస్‌ ఫైనాన్స్‌ కంపెనీ వారి వద్ద బైక్‌ కొనుగోలు చేసి వాయిదాలు చెల్లిస్తున్నప్పటికీ తప్పుడు లెక్కలు చూపి డబ్బు చెల్లించాలని వేధిస్తున్నారని.. ఇదే విషయమై స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు కానిస్టేబుల్‌ సత్తార్‌ తనపై చేయి చేసుకున్నాడని , ఎస్‌ఐ కాశీనాథ్‌ దూషించాడని శ్రీనివాస్‌ ఆరోపించారు. ఇదే విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా.. వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో పాటు సిబ్బందిని శ్రీనివాస్‌ దూషిస్తున్నాడని ఫైనాన్స్‌ కంపెనీ వారు ఫిర్యాదు చేశారన్నారు. ఇదే విషయమై మాట్లాడుదామని లోపలికి రావాలని కోరిన కానిస్టేబుల్‌ సత్తార్‌ను శ్రీనివాస్‌ దూషించాడన్నారు. దీంతో వారిద్దరి మధ్య పెనుగులాట జరిగిందే తప్ప దాడి జరగలేదన్నారు. ఈ కేసు పూర్తి విచారాణ చేస్తానని పట్టణ సీఐ సంతోశ్‌కుమార్‌ తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తిపై కానిస్టేబుల్‌ దౌర్జన్యానికి దిగడం సరికాదని.. పూర్తి విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్‌ నాయకుడు రాజుగౌడ్‌, విద్యార్థి సంఘం నాయకుడు దీపక్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. కానిస్టేబుల్‌, ఎస్‌ఐపై చర్యలు తీసుకోని ఎడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నూతన చట్టాలు భద్రతకు మైలురాయి

మహేశ్వరం/పహాడీషరీఫ్‌: త్వరలో అమలులోకి రానున్న నూతన చట్టాలు మన దేశ శాంతి భద్రతల పరిరక్షణలో ఒక మైలురాయిగా నిలుస్తాయని రాచకొండ పోలీస్‌ కమిషనర్‌ తరుణ్‌ జోషి అన్నారు. జూలై 1వ తేదీ నుంచి భారత ప్రభుత్వ నూతన నేర న్యాయ చట్టాలు అమలులోకి రానున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి సంపూర్ణ పరిజ్ఞానం కలిగించేందుకు ఆర్‌సీఐలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాములు ఈ సందర్భంగా నూతన చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచకొండ సీపీ తరుణ్‌ జోషి మాట్లాడుతూ.. నూతన చట్టాలతో కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఏసీపీ పి.లక్ష్మీకాంత్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

- అప్పు ఇచ్చిన డబ్బు అడిగినందుకే హత్య..?
- కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



మృతురాలి ఇంటి పరిసరాల్లో వివరాలు సేకరిస్తున్న డాగ్‌ స్క్వాడ్‌, క్లూస్‌ టీం



బాలమ్మ మృతదేహం

దోమ: ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దాదాపూర్‌ తండాకు చెందిన బాలమ్మ(68)కి నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆమె కూతురు, మరో కుమారుడు వెంకటయ్య వేర్వేరు నివాసాలు ఏర్పరుచుకున్నారు. బాలమ్మ రోజు వెంకటయ్య ఇంట్లో భోజనం చేస్తూ తన ఇంట్లో నిద్రించేది. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి భోజనం తర్వాత ఇంటికి వచ్చి గురువారం బయటకు రాలేదు. దీంతో పక్కనే ఉండే తండా వాసి సువలమ్మ దగ్గర వెళ్లి చూడగా మృతి చెంది ఉందింది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. ఘటన స్థలానికి వచ్చిన కుటుంబ సభ్యులు మృతి చెందిన బాలమ్మ గొంతుపై గాయాలు, నోటి నుంచి నురగలున్నాయి. ఆమె ముక్కు పుడక సైతం కనిపించకపోవడంతో తండాకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డబ్బుల విషయంలోనే..

బాలమ్మ గతంలో తండాకు చెందిన ఓ వ్యక్తికి డబ్బు ఇచ్చింది.. ఆయను తిరిగి అడగడంతో గొడవ చేశారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తనే హత్య చేసి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు డాగ్‌ స్క్వాడ్‌, క్లూస్‌ టీం వివరాలు సేకరించారు. బాధితులు అనుమానం వ్యక్తం చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేడు మేయర్‌ ఎన్నిక

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషనన్‌ పరిధిలో నూతన మేయర్‌ను ఎన్నిక నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం కార్పొరేషన్‌ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్ర త్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మేయర్‌ను ఎన్నుకోనున్నారు. కార్పొరేషన్‌ 17వ డివిజన్‌ కార్పొరేటర్‌ లతాప్రేమ్‌గౌడ్‌ను ఎన్నుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. కార్పొరేషన్‌ మొదటి మేయర్‌గా బుర్ర మహేందర్‌గౌడ్‌ ఉన్న సమయంలో 16 మంది కార్పొరేటర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానంపై లేఖ ను సమర్పించారు. దీంతో కలెక్టర్‌ ఆదేశాల మేరకు కమిషనర్‌ బి.శరత్‌చంద్ర మార్చి 21న బలనిరూపణ చేపట్టారు. అవిశ్వాసం నెగ్గిన కార్పొరేటర్లు మేయర్‌ను గద్దెదించారు. ఇదిలా ఉండగా గురువారం మేయర్‌ ఎన్నికను ఆపాలని కోరుతూ మాజీ మేయర్‌ మహేందర్‌గౌడ్‌, కార్పొరేటర్‌ సాగర్‌గౌడ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ వేసి మేయర్‌ ప్రక్రియను నిలుపుదల చేయాలని కో రారు. కానీ జడ్జి వీరి పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో మేయర్‌ ఎన్నికకు రూట్‌ క్లియర్‌ అయింది.

‘ఆదర్శం’గా పూర్తి చేయండి

- అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌
- ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన



కద్లాల్‌: అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌

కద్లాల్‌: ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా ఎంపికైన మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్‌ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజనీరింగ్‌ బృందం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్‌, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పనులు వేగవంత చేసి సకాలంలో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్‌, ఏఈ పరమేశ్‌, ఎంఈవో సర్దార్‌నాయక్‌, నోడల్‌ అధికారి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు పూర్తి కావాలి

మాడ్గుల: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని గిరికొత్తపల్లి పాఠశాలను గురువారం ఆమె పరిశీలించారు. విద్యుత్‌, వైరింగ్‌, నల్లాల ఏర్పాటు పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి సర్దార్‌ నాయక్‌, ఎంపీఓ సూర్యవంశీ, ఎంపీడీవో సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా భూ కబ్జా!

- రూ.60 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- సేల్‌ డీడ్‌లు, నోటరీలుగా అమ్మకం
- దర్జాగా అక్రమ నిర్మాణాలు
- అక్రమార్కులతో అధికారుల కుమ్మక్కు
- ప్రభుత్వ భూములు కాపాడాలని డిమాండ్‌



ప్రభుత్వ భూమిలో వెలుస్తున్న ప్రహరీలు, గోదాంలు

మణికొండ: అది ప్రభుత్వ భూమి.. అందున అక్కడ గజం రూ. 80 వేల నుంచి లక్ష వరకు పలుకుతోంది. దీంతో ఆ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. దీనికి అధికారుల సహకారం కూడా తోడుకావటంతో ఇంకేముంది ఇష్టారీతిన నోటరీల రూపంలో స్థలాలను అమ్మకాలు కూడా చేపట్టారు. అయితే ఏది ప్రభుత్వ భూమో.. ఏది లేఅవుట్‌ చేసిన ప్లాటో తెలియని పేద, మధ్య తరగతి ప్రజలు తక్కువ ధరలకే వస్తుందని కొనుగోలు చేసి నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. అలా కొనుగోలు చేసిన స్థలాలో గృహాలు, ప్రహరీలు, గదులు నిర్మాణాలు చేస్తున్నారు. కొన్నింటికి ఏకంగా మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకున్నట్టు సమాచారం. గతంలో పనిచేసిన రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి యథేచ్ఛగా ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే... గండిపేట మండలం, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్‌ 116 నుంచి 118, 136 నుంచి 143ల వరకు బయోడ్‌కాలనీ లేఅవుట్‌ చేశారు. దాని పక్కనే సర్వే నెంబర్‌ 146లో 15 గుంటలు, 147, 148లలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇవే ప్రభుత్వ సర్వే నెంబర్‌ల నుంచి పండెన్‌వాగు నాలా ప్రవహిస్తుంది. అప్పట్లో ప్రభుత్వ భూమిని వదిలి మిగతా పట్టా భూమిలో బయోడ్‌ కాలనీ లేఅవుట్‌ వేయటంతో అందులో అనేకమంది ప్లాట్లను కొనుగోలు చేసి గృహాలు, అపార్ట్‌మెంట్లను నిర్మించుకున్నారు.

ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్ను

బయోడ్‌కాలనీ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. బయోడ్‌ కాలనీ సర్వే నెంబర్‌లతోనే అప్పటి యజమానుల వారసులతో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్‌లు చేసి అమ్మకాలు సాగించారు. తక్కువ ధరలో వస్తుండటం, అభివృద్ధి చెందిన కాలనీ కావటంతో అనేక మంది కొనుగోలు చేశారు. దీంతో అక్రమార్కులు అప్పనంగా కోట్ల రూపాయలను దండుకున్నారు. అందులో అప్పటి రెవెన్యూ అధికారులకు వాటాలు ఇవ్వటంతో వారు మిన్నకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో అక్రమార్కుల ఆగడాలు జోరుగా సాగాయని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇదే తరహాలో నెక్నాంపూర్‌ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్‌ 20లోనూ ఉన్న ప్రభుత్వ భూమిని అమ్మకాలు చేపట్టారు. అక్కడా నిర్మాణాలు కూడా వెలుస్తున్నాయి. రిజిస్ట్రేషన్‌ డాక్యుమెంట్లు ఉండటంతో మున్సిపాలిటీ వారు భూమి వివరాలను పట్టించుకోకుండా నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. అంతేకాకుండా వెంకటేశ్వర కాలనీలోని పార్కు స్థలాలను ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేయటంతో వాటిల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ విషయం గతంలో ‘సాక్షి’ దినపత్రిక ప్రముఖంగా ప్రచురించటంతో కొన్నిపార్కులతో పాటు సర్వే నెంబర్‌ 20లోని కొంత ప్రభుత్వ భూమిని అప్పటి ఆర్‌డీఓ చంద్రకళ పరిరక్షించారని ఆ కాలనీ వాసులు తెలిపారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను గత ప్రభుత్వం రెగ్యులరైజ్‌ చేసేందుకు జీవో 58, 59లు తేవటంతో బయోడ్‌కాలనీ పక్కన ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన పలువురు విషయం తెలుసుకుని రెగ్యులరైజేషన్‌కు పెట్టుకున్నట్టు తెలిసింది. ప్రధాన రోడ్డుకు ఉన్న ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా షాపులు నిర్మించుకుని మున్సిపాలిటీకి పన్నులు చెల్లించి, విద్యుత్‌ మీటర్లు తీసుకుని మరీ క్రమబద్ధీకరణకు పెట్టుకున్నట్టు సమాచారం. గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులు ఇక్కడ వెలిసిన షాపులను తొలగించారు. తిరిగి అక్కడే నిర్మించుకుని ఈసారి క్రమబద్ధీకరణకు పెట్టుకున్నట్టు తెలిసింది. ఇలాంటి ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకే ప్రజలు చెల్లించే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూడటంతో పాటు అక్రమార్కులతోనే చేతులు కలిపి వారికి అండదండలు అందిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్‌ శశాంక, రాజేంద్రనగర్‌ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డిలు స్పందించి ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణాలను తొలగించి పరిరక్షించాలని వారు డిమాండ్‌ చేస్తున్నారు.